యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా కిషోర్‌కుమార్

కిషోర్‌కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కాకినాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) 17వ రాష్ట్ర మహాసభల సందర్భంగా రెండోసారి రాష్ట్ర కార్యదర్శిగా సంపతిరావు కిషోర్‌కుమార్ ఎన్నికయ్యారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో 20 ఏళ్ల నుంచి కీలకంగా వ్యవహరించారు. ఉపాధ్యాయులకు అందుబాటులో ఉన్నారు. సంఘంలో మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేశారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ఉద్యమాల్లో నాయకత్వం వహించారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైనందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రయాణ అవస్థలు

- పండగ వేళ బస్సుల్లేక ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు
- ప్రధాని మోడీ సభకు 235 ఆర్‌టిసి బస్సుల తరలింపు
- కిక్కిరిసిన బస్సుల్లో ప్రయాణిస్తూ అవస్థలు
- బస్సుల్లేని రూట్లలో ప్రయివేట్ వాహనాలే దిక్కు

కూటమి ప్రభుత్వంలో జగన్ పాలన మాదిరి పరదాలు ఉండవు... జనం తరలింపు ఉండదు. గేట్లు దాటి వెళ్లిపోవడలూ ఉండవంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా కూటమి నేతలు పదేపదే చెప్పారు. ప్రజలు నిజమే కాబోలు అని అనుకున్నారు. బస్సు తరలింపుతో ప్రయాణ ఇబ్బందులు, ట్రాఫిక్ మళ్లింపులు, గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడం వంటివి తప్పుతాయని అంతా భావించారు. నీతులు చెప్పిన నేతలే తామేమీ తక్కువ తినలేదన్నట్లుగా విశాఖలో నిర్వహించిన మోడీ సభకు వందలాది ఆర్‌టిసి బస్సుల్లో జనాలను తరలించారు. జనాలకు కష్టాలను మిగిల్చారు. పండగ వేళ బస్సుల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటనను టిడిపి కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సభకు లక్ష మందిని తరలించి తన సత్తా చాటాలని భావించింది. విశాఖకు సమీపంలో ఉన్న జిల్లాల నుంచి ప్రజలను తరలించి విజయవంతం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఆర్‌టిసి బస్సులను అధిక సంఖ్యలో వినియోగించుకుంది. జిల్లాలో 340 ఆర్‌టిసి బస్సులు ఉంటే ఏకంగా 235 బస్సులను విశాఖకు పంపారు. జిల్లాలో నాలుగు డిపోలు ఉండగా శ్రీకాకుళం-1, 2 డిపోల నుంచి 140 బస్సులు, పలాస నుంచి 50, టెక్కలి నుంచి 45 బస్సులు చొప్పున పంపారు. దాదాపు 70 బస్సులను తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా పల్లె వెలుగు బస్సులను అధిక శాతం పంపడంతో గ్రామీణ ప్రాంతాలకు అరకొరగా బస్సులు తిరిగాయి. శ్రీకాకుళం-1, 2 డిపోల పరిధిలో బత్తిలి, కొత్తూరు, పాతపట్నం, చీపురుపల్లి, రాజాం, సాలూరు వంటి ముఖ్యమైన ప్రాంతాలతో పాటు మారుమూల గ్రామాలకు అరకొరగా బస్సులు నడిచాయి. పలాస డిపో పరిధిలో ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం రూట్‌లో పూర్తిగా బస్సులను నిలిపివేశారు. కొత్తూరు రూట్‌లో ఏడు బస్సులు తిరగాల్సి ఉండగా, ఒక బస్సు మాత్రమే తిరిగింది. పలాస నుంచి మందసకు ఏడు బస్సులు తిరగాల్సి ఉండగా, ఒక బస్సు మాత్రమే నడిచింది. పలాస నుంచి శ్రీకాకుళం వరకు పల్లె వెలుగు బస్సులు ఏడూ తిరగాల్సి ఉండగా, కేవలం మూడు మాత్రమే తిరిగాయి. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు పల్లె వెలుగు బస్సులు ఐదు తిరగాల్సి ఉండగా, ఒకటి మాత్రమే తిరిగింది. కవిటి, ఇచ్ఛాపురం, పొత్తంగి, గాటి గంగాధరపురం గ్రామాలకు పూర్తిగా బస్సులు నిలిపివేశారు. బ్రాహ్మణతర్లా, టెక్కలిపట్నం, గొప్పిలి, రెంటికోట, లొద్దభద్ర తదితర రూట్లలో వెళ్లాల్సిన బస్సులను సభకు మళ్లించారు.

కాశీబుగ్గ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

బస్సు ఎక్కేందుకు అవస్థలు పడుతున్న చిన్నారితో ఓ మహిళ

బస్సుల తరలింపుతో ప్రయాణికుల పాట్లు

జిల్లా నుంచి 70 శాతం బస్సులను మళ్లించడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. పండగ సీజన్ కావడంతో వస్త్రాలు, సరుకుల కొనుగోలుకు పట్టణాలకు వచ్చిన ప్రజలు సమయానికి బస్సుల్లేక ఇబ్బందులు పడ్డారు. బస్సుల కోసం ఆర్‌టిసి కాంప్లెక్స్‌ల వద్ద గంటల తరబడి నిరీక్షించారు. బస్సులు కిక్కిరిసిపోవడంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడ్డారు. శ్రీకాకుళం నగరం, నరసన్నపేట, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో ఆటోలు, మ్యాక్సీ కేబ్‌లను ఆశ్రయించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆటోల్లో తమ ఇళ్లకు చేరారు.

సభకు వెళ్లేందుకు ఆసక్తి చూపని జనం

విశాఖలో నిర్వహిస్తున్న ప్రధాని మోడీ సభకు వెళ్లేందుకు జనం పెద్దగా ఆసక్తిగా చూపలేదు. జిల్లాలోని అన్ని డిపోల నుంచి బస్సులు వేసినా ఒక్కో బస్సుకు 25 నుంచి 30 మంది వరకు మాత్రమే ఎక్కినట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ధాన్యం అమ్మకాలు, నూర్పులు ఉండడంతో రైతులు తాము వెళ్లేందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. పండగ సమయం కావడంతో మహిళలూ విముఖత ప్రదర్శించారు. జనాల తరలింపును టిడిపి నేతలు అంత సీరియస్‌గా తీసుకోలేదని తెలుస్తోంది. దీంతో అధిక శాతం బస్సులు కొద్దిమందితోనే విశాఖకు వెళ్లాయి.

ఆర్‌టిసి సిబ్బందికీ ఇబ్బందే

బస్సుల సంఖ్య విషయంలో అధికారుల్లో స్పష్టత కరువవడంతో ఆర్‌టిసి సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ఏ రూట్‌లో ఎన్ని బస్సులు పంపాలో చివరివరకు తెలియకపోవడంతో, కొంత గందరగోళం చోటుచేసుకున్నట్లు తెలిసింది. బస్సులను సిద్ధం చేసినా డ్రైవర్లను గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు తలెత్తాయి. రాత్రి ఒంటి గంటకే బస్సుల వద్ద ఉండాలని అధికారులు ఆదేశించడంతో డ్రైవర్లు పడిగాపులు కాస్తూ అవస్థలు పడ్డారు. వేకువజామున జనాలను ఎక్కించుకుని వారు బయలుదేరారు. వారిని పర్యవేక్షిస్తూ అధికారులూ జాగారం చేయాల్సి వచ్చింది. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్‌తో పాటు అన్ని డిపోల మేనేజర్లు బస్సులు తిరిగి తమ డిపోలకు చేరే వరకు విశాఖలోనే ఉన్నారు. వారంతా అర్ధరాత్రి వరకు పర్యవేక్షించారు.

బస్సుల్లేక మ్యాక్సీ కేబ్‌లో ప్రయాణం

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

రూ.1580.59 కోట్లతో జెడ్‌పి వార్షిక బడ్జెట్

అంచనా వ్యయం రూ.1462.20 కోట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాపరిషత్‌కు గతేడాది వచ్చిన ఆదాయం, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, పలు అనుబంధ శాఖలకు అందజేసిన నిధులు, చేపట్టిన వ్యయం పరిగణనలోకి తీసుకుని 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో బడ్జెట్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ రాబడి అంచనా అనుసరించి జిల్లాపరిషత్ సహా పిఐయు, పంచాయతీరాజ్, పిఆర్ఐ శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ డివిజన్లు, ఆర్‌డబ్ల్యుఎస్ విభాగాలకు సంబంధించి రూపొందించిన ఈ బడ్జెట్‌లో రూ.1580,59,07,806 ఆదాయం వస్తుందని అంచనా వేశారు. అందులో కార్యాలయాల నిర్వహణ, ఇతర అభివృద్ధి ఖర్చులు రూ.1462,20,29,241 వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ అంచనాలను అనుసరించి ఈ ఏడాది మిగులు రూ.118,38,78,565 ఉంటుందని అందులో పేర్కొన్నారు. శాఖల వారీగా చూస్తే జిల్లా పరిషత్ పరిధిలో 2025-26 సంవత్సరానికి గానూ ఆదాయం రూ.41,92,69,300 కాగా, వ్యయం రూ. 41,74,96,100 ఉంటుందని, అందులో మిగులు రూ.17,73,200 ఉంటుందని అంచనా వేశారు. శ్రీకాకుళం పంచాయతీరాజ్ పి.ఐ.యు డివిజన్ పరిధిలో 2025-26 సంవత్సరానికి ఆదాయం అంచనా రూ.424,31,35,000 కాగా, వ్యయం రూ 383,04,16,500, మిగులు రూ.41,27,18,500గా చూపించారు. పంచాయతీరాజ్ పిఆర్ఐ శ్రీకాకుళం డివిజన్‌లో 2025-26 వార్షిక ఆదాయం రూ.112,49,15,616 కాగా, వ్యయం రూ.112,40,65,616, మిగులు రూ.8,50,000 ఉంటుందని అంచనా రూపొందించారు. పంచాయతీరాజ్ టెక్కలి డివిజన్‌లో 2025-26 సంవత్సరానికి ఆదాయం రూ.47,47,12,633 కాగా, వ్యయం రూ.45,11,86,490, మిగులు రూ.2,35,26,143 ఉంటుందని అంచనా వేశారు. ఉమ్మడి జిల్లాలోని పాలకొండ పిఆర్ఐ డివిజన్‌లో 2025-26 వార్షిక ఆదాయం రూ. 211,59,48,047 కాగా, వ్యయం రూ.207,80,70,000, మిగులు రూ.3,78,78,047 ఉంటుందని అంచనా పొందుపరిచారు.

ఆర్‌డబ్ల్యుఎస్ శ్రీకాకుళం డివిజన్‌లో 2025-26 సంవత్సరానికి ఆదాయం రూ.742,79,27,210, వ్యయం రూ.672,07,94,535, మిగులు రూ.70,71,32,675 ఉంటుందని అంచనా వేశారు. సమావేశంలో జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పి.శ్రావణి, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ డి.సత్యనారాయణ, పి.ఐ.యు డివిజన్, పి.అర్.ఐ, పంచాయతీరాజ్ శ్రీకాకుళం కార్యనిర్వాహక ఇంజినీరు ఎస్.రామకృష్ణ, పలు శాఖల అధికారులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఒకటో స్థాయీ సంఘం సమావేశం జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ అధ్యక్షతన నిర్వహించారు.

అవార్డు అందుకుంటున్న శాస్త్రవేత్తలు

రాష్ట్రస్థాయి ఉత్తమ పరిశోధనా కేంద్రంగా రాగోలు

వరి రకాలు, అపరాల విత్తనోత్పత్తి రూపకల్పనలో అగ్రస్థానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానంకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ వ్యవసాయ పరిశోధనా స్థానంగా 2023 సంవత్సరానికి గానూ అవార్డు లభించింది. రాగోలు వ్యవసాయ స్థానంలో వరి రకాల రూపకల్పనలో చేపట్టిన విస్తృత పరిశోధనలు, వరి, మినుము, పెసరలో బ్రీడర్ సీడ్ విత్తనోత్పత్తి, జన్యు స్వచ్ఛత కలిగిన వరి విత్తనోత్పత్తి సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. దీనికితోడు రైతులకు సాంకేతికపరమైన సేవలందించడంలోనూ అగ్రభాగాన నిలిచింది. గుంటూరు లాంఫారంలో 58వ ఆర్ఇఎసి సమావేశాలను పురస్కరించుకుని వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు, ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి చేతుల మీదుగా ఈ అవార్డును బుధవారం అందజేశారు. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానం సంచాలకులు డాక్టర్ పి.వి సత్యనారాయణ, పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ పి.ఉదయబాబు, కె.మధుకుమార్ అందుకున్నారు.

ఐటిడిఎ సాధనకు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని, ఆదివాసీ గ్రామాలను ఐదో షెడ్యూల్డ్‌లో చేర్చాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన ఈ నెల 11న ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు ఆధ్వర్యాన మండలంలోని ముకుందపురంలో బుధవారం బైక్ ర్యాలీని ప్రారంభించారు. ముకుందాపురం, సున్నాపురం, గోవిందపురం, డబారు, గోడ్డూరు, అనంతగిరి, రింపి, నేలబొంతు గ్రామాల్లో ఈ ర్యాలీ సాగింది. బైక్ ర్యాలీ నిర్వహించి ఆదివాసీల్లో చైతన్యం తీసుకొచ్చారు. ఐటిడిఎ సాధనకు, ఆదివాసీ గ్రామాలను ఐదో షెడ్యూల్డ్‌లో చేర్చడానికి ఈ ర్యాలీ దోహదపడుతుందన్నారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడాలని, చట్టం అమలు చేయాలని, ఆదివాసీల సంక్షేమంపై పాలకుల నిర్లక్ష్య వైఖరి విడనాడాలని నినాదాలు చేశారు. ఐటిడిఎ లేకపోవడంతో ఆదివాసీలకు ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన చెందారు. ఆదివాసీలు ఎన్నో పోరాటాలతో, త్యాగాలతో ఐటిడిఎ వచ్చిందని, అలాంటి ఐటిడిఎ జిల్లాకు లేకపోవడం విచారకరమని మాధవరావు తెలిపారు. కార్యక్రమంలో ముకుందాపురం, ఆంపురం సర్పంచ్‌లు భాస్కరరావు, జమ్మయ్య వార్డు మెంబర్ గౌరేసు, సవర శ్రీను, శంకర్, నూకయ్య, ఢిల్లీరావు, సురేష్, ఆదినారాయణ, అప్పారావు, గిరి, జానకిరామ్, ఈశ్వరరావు, అప్పన్న, యోగేశ్వరరావు, నిఖిల్, సుబ్బారావు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

దళారుల ప్రమేయాన్ని తగ్గించేందుకు చర్యలు

- ఆన్‌లైన్‌లో దస్తావేజుల తయారీ
- జిల్లా రిజిస్ట్రార్ నాగలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజలు ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం సొంతంగా దస్తావేజును తయారు చేసేందుకు వీలు కల్పిస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ ఆధ్వర్యాన వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు జిల్లా రిజిస్ట్రార్ ఎ.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. దళారీ వ్యస్థను రూపుమాపడానికి వీలుగా ప్రభుత్వం registration.ap.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. అందులో ఉన్న ప్రైమ్ డాటా ఎంట్రీ అండ్ డాక్యుమెంట్ జనరేషన్ ద్వారా స్వయంగా లబ్ధిదారులు తమ డాక్యుమెంట్లను తయారు చేసుకోవచ్చన్నారు. ఎన్ కంబరెన్స్ (ఇసి), నకలు (సిసి), మార్కెట్ విలువ సర్టిఫికెట్ (ఎంవి), స్టాంపుల కోసం కూడా నేరుగా దరఖాస్తు చేసుకొవచ్చన్నారు. registration.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉన్న హిందూ వివాహ రిజిస్ట్రేషన్, స్పెషల్ వివాహాల రిజిస్ట్రేషన్ కోసం స్వయంగా ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఈ సేవలను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా పొందవచ్చన్నారు. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ ప్రజల అవసరానికి హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర సేవల కోసం వచ్చే ప్రజలు దస్తావేజు లేఖరులు, మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా సబ్ రిజిస్ట్రార్‌ను, హెల్ప్ డెస్క్‌లో ఉన్న ఉద్యోగిని సంప్రదించి సేవలను పొందవచ్చన్నారు. సేవకు గాను సిఎఫ్ఎంఎస్ చలానా ద్వారా నిర్దేశిత రుసుం చెల్లించి వారికి కావలసిన సేవలను పొందవచ్చని సూచించారు.

పోర్టు వాహనాలతో బెంబేలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నిర్మాణానికి సంబంధించిన భారీ వాహనాలతో కోటబొమ్మాళి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇసుక, మెటల్, రాళ్ల లోడులతో జనావాసాలతో కూడా వేగం తగ్గకుండా ఇష్టారాజ్యంగా వెళ్తున్నాయి. దీంతో చిన్నారులు, విద్యార్థులు భయాందోళన గురవుతున్నారు. ఈ వాహనాలు వెనుక దుమ్ము, దూళి అధికంగా రావడంతో కోటబొమ్మాళి, సీతన్నపేట, ఉప్పరపేట, దుర్గంపేట గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పలువురు వాపోతున్నారు. పోర్టు వాహనాలు అధిక స్పీడ్‌తో వెళ్లడం వల్ల మెటల్, రాళ్లు దారిలో తుళ్లి పడుతుండడంతో వెనుక వచ్చిన ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రాళ్లు ఎప్పుడు ఎవరిపైన పడుతాయేయని, ఈ భారీ వాహనాలు వల్ల రోడ్లు కూడా ధ్వంసం అయ్యాయని వాపోయారు. దీనికి ఎవ్వరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో రాత్రి వేళ పెద్ద బండరాళ్లు కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డులో పడడం వల్ల తృటిలో ప్రమాదం తప్పింది. ఇదే పరిస్థితి పునరావృతం అయ్యే ప్రమాదం లేకపోలేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిత్యం జనవాహాలతో నిండి ఉన్న కోటబొమ్మాళి రహదారిలో కాకుడా వేరే మార్గాన్ని మళ్లించాలని ప్రజలు కోరుతున్నారు.

వేగంగా దూసుకొస్తున్న పోర్టు వాహనాలు

ఫార్మసీ అభ్యర్థులకు శుభవార్త

- మందుల దుకాణాల ఏర్పాటుకు ప్రోత్సాహం
- నేటి నుంచి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- లబ్ధిదారుని వాటా లేకుండా యూనిట్‌కు రూ.8 లక్షలు
- బిసి కార్పొరేషన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బి, డి-ఫార్మసీ కోర్సులు చేసి సొంతంగా మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. ఇందులో భాగంగా బిసి, ఇడబ్ల్యుసి తరగతులకు ఈ దుకాణాలను మంజూరు చేయనున్నారు. బి, డి-ఫార్మసీ కోర్సులు చదివి నిరుద్యోగులుగా ఉన్న వారితో జనరిక్ ఔషధ దుకాణాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఉత్తర్వులు విడుదల చేసింది. జిల్లాలోని బిసి, ఇడబ్ల్యుఎస్ తరగతుల యువతకు 63 యూనిట్లకు రూ.5.04 కోట్లు మంజూరు చేసింది. ఇందులో బిసిలకు 55 యూనిట్లు, ఇడబ్ల్యుఎస్ కోటాకు ఎనిమిది యూనిట్లు మంజూరు చేయనున్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.2.52 కోట్లు బ్యాంకు రుణం కాగా, మిగిలిన మొత్తం రూ.2.52 కోట్లు రాయితీ లభిస్తుంది.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

జిల్లాలో ఎంఎస్ఎంఇ శాఖ ద్వారా బిసి విభాగాల్లోని ఎ, బి, డి, ఇ తరగతులు, ఇడబ్ల్యుఎస్ (ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ) వారికి బిసి కార్పొరేషన్ ఈ యూనిట్లను మంజూరు చేయనుంది. ఇందుకు 21 నుంచి 60 ఏళ్ల లోపు వయసు, బి, డి-ఫార్మసీలో ఉత్తీర్ణత సాధించిన వారు ఈనెల తొమ్మిది నుంచి 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 17 నుంచి 19వ తేదీ వరకు మండలాల వారీగా మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థులు బిపిఎల్ కుటుంబానికి చెంది ఉండాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతోపాటు ఆధార్ ఇతర ప్రభుత్వ గుర్తింపుకార్డులు ఉండాలని అందులో పేర్కొన్నారు. 2014-19 కాలంలో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో డిఆర్‌డిఎ-వెలుగు ఆధ్వర్యాన అన్న సంజీవని పేరుతో బి, డి-ఫార్మసీ కోర్సులు పూర్తి చేసిన స్వయం సహాయక సంఘాలకు చెందిన సభ్యులు, కుటుంబసభ్యులకు మందుల దుకాణాలను కేటాయించారు. అప్పట్లో జిల్లా కేంద్రంలో నాలుగు, మండల కేంద్రాల్లో ఒక్కొక్కటి మంజూరు చేశారు.

అర్హులంతా దరఖాస్తు చేసుకోవచ్చు

ఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులు సచివాలయాల్లో గానీ ఒబిఎంఎంఎస్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల పరిశీలన అనంతరం బ్యాంకు ఆమోదం మేరకు వచ్చే నెల 27వ తేదీ నుంచి యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు వీలు కల్పించడమైంది. అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి.

- గడ్డెమ్మ, ఇడి, బిసి కార్పొరేషన్

శిక్షణ ఇస్తున్న శ్రీనివాస్

వృత్యంతర శిక్షణ విద్యార్థులకు కీలకం

డివిఇఒ తవిటినాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

వృత్తి విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు క్షేత్రస్థాయిలో ఆన్ ద జాబ్ శిక్షణ (వృత్యాంతర) ఉపయోగపడుతుందని ఇంటర్మీడియట్ విద్య జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి (డివిఇఒ) శివ్వాల తవిటినాయుడు అన్నారు. వృత్తి విద్య కోర్సుల అకాడమిక్ కేలెండర్ ప్రకారం ఏటా ఆన్ ద జాబ్ శిక్షణ నిర్వహించాలని సూచించారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం అక్షయ ఫౌండేషన్‌లో నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆన్ ద జాబ్‌పై బుధవారం శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తోన్న అక్షయపాత్ర ఫౌండేషన్ కార్యాలయంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సరుకుల సరఫరా, వివిధ రకాల ఆహార వంటల తయారీ విధానం, పంపిణీ, అకౌంటింగ్ పుస్తకాల నిర్వహణ అంశాలపై సంస్థ మేనేజర్ వెంకటరాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ సూచనల మేరకు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వదనగిరి ఆదేశాలతో విద్యార్థులకు ఆన్ ద జాబ్ ట్రైనింగ్ నిర్వహించామని అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎపిఎఒ, లైబ్రేరియన్ తాతారావు అక్షయపాత్ర సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM EXCISE COURT AT SRIKAKULAM
IA 310/2024 in OS.412/2024

Between:-
Karanam Satyanarayana ----Petitioner/Plaintif
And:-
K. Padma latha and others. ----Respondents/Defandent
To,
R/D-4:- Komaturu Mahalaxmi, W/o Late Latchanna, Residing at Flat No.109, Plot No 69. Sai Enclaves Apartment, Govindanagar Colony, Srikakulam Town and District.

NOTICE

Please take Notice that the above matter is posted to 28-01-2025 for your Notice and appearance. So you shall appear in person or through Advocates on **28-01-2025 at 10.30 AM.,** If you fail to appear on that day before the above Hon'ble Court you will be treated as Ex-party

// By order of the Hon'ble court //

**MATHALA CHANDANA
YAPARA PAVANI
ADVOCATES,
SRIKAKULAM, CELL: 9059514667**

మహారాజ శ్రీ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) కొత్తూరు వారి కోర్టులో
O.S 30/2024

Between:-
గూన విష్ణుమూర్తి .....వాది
And:-
కరుకోల దాలినాయుడు .....ప్రతివాది

దావా సమను

ఇందుమూలంగా తెలియజేయంది ఏమనగా వాది తనకు మీరు బాకీ ఉన్న 10,86,119/- రూ॥ (పది లక్షల ఎనబై ఐదు వేల ఒక వంద పందొమ్మిది రూపాయలు) మీ నుండి వసూలు చేయు నిమిత్తం పై నెంబర్ దావా దాఖలు చేసి అనేక పర్యాయములు సమన్లు పంపినప్పటికీ మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకొనకుండా తప్పించుకుంటున్నందువలన శ్రీ కోర్టు వారు పై దావాలో ఇచ్చిన ఆదేశాలు ప్రాప్తికి మీరు స్వయంగా గాని లేదా వకీల్ ద్వారా గాని తేదీ **20-01-2025 ఉదయం 10:30 గంటలకు** శ్రీ కోర్టు వారి ముందు హాజరు కావలెను. లేనిలెడల మీ పరోక్షమున పై దావా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

**రెడ్డి ఉమామహేశ్వరరావు
న్యాయవాది, కొత్తూరు.**

మహారాజ శ్రీ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) కొత్తూరు వారి కోర్టులో
IA. 61/2024 in O.S 30/2024

Between:-
గూన విష్ణుమూర్తి .....పిటిషనర్/వాది
And:-
కరుకోల దాలినాయుడు .....రెస్పాండెంట్/ప్రతివాది

నోటీస్

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పిటిషనర్/వాది తనకు బాకీ ఉన్న 10,86,119/- రూ॥ (పది లక్షల ఎనబై ఐదు వేల ఒక వంద పందొమ్మిది రూపాయలు) మీ నుండి వసూలు చేయు నిమిత్తం పై నెంబర్ దావాకు అనుబంధంగా పై నెంబరు IA. పిటిషన్ దాఖలు చేసి ఈ కింది షెడ్యూల్ దాఖలో ఆస్తిని జప్తు చేయమని శ్రీ కోర్టు వారిని ప్రార్థించగా పై పిటిషన్‌లో కోర్టు ఉత్తర్వులు మేరకు ఎన్ని సార్లు పంపినప్పటికీ పిటిషన్‌లో నోటీసులు ఉద్దేశ్యపూర్వముగా మీరు తీసుకోనకుండా తప్పించు కుంటున్నాందున పై పిటిషన్‌లో శ్రీకోర్టు వారు ఆదేశాలు ప్రాప్తికి మీరు స్వయంగా గాని లేదా వకీల్ ద్వారా గాని **తేదీ 20-01-2025 ఉదయం 10:30 గంటలకు** శ్రీ కోర్టు వారి ముందు హాజరు కావలెను. లేనియెడల మీ పరోక్షమున పై పిటిషన్ తీర్మానించబడునని తెలియజేయడమైనది.

షెడ్యూల్ ఆస్తి వివరాలు:
శ్రీకాకుళం జిల్లా, కొత్తూరు మండలం, బమ్మిడి గ్రామం, హిరమండలం సబ్‌రిజిస్ట్రర్ వారి పరిధిలోని బమ్మిడి గ్రామం, కొత్త వీధి దక్షిణశ్రేణిలోగల పెంకు మరియు స్లాబ్ ఇల్లు. తూర్పు-పడమరలకు ఆరడుగులు ఉత్తర-దక్షిణములకు 90 అడుగులు ఈక్రింది హద్దులు మధ్దస్తుమైన ఆస్తి:
తూర్పు: రోణంకి రాజారావు స్లాబ్ ఇల్లు
దక్షిణ: కరుకోల దాలినాయుడు, రమేష్ లు ఖాళీ స్థలంలు
పశ్చిమ: కరుకోల రమేష్ తాలూకా పెంకు మరియు స్లాబ్ ఇల్లు
ఉత్తరం: సి.సి రోడ్డు

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

**రెడ్డి ఉమామహేశ్వరరావు
న్యాయవాది, కొత్తూరు.**

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

ప్రజాశక్తి- నరసన్నపేట

అధైర్య పడవద్దు... అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం వృద్ధాశ్రమంలో పనిచేస్తున్న కెవియస్ శాంతమూర్తి ఎముకల వ్యాధితో బాధపడుతూ శస్త్ర చికిత్స నిమిత్తం రూ.1.50 వేలు, పప్పుల వీధికి చెందిన తంగుడు ప్రమిల మోకాళ్ల శస్త్ర చికిత్స కోసం రూ.81 వేలు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం అందజేశారు. సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరో పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుతున్నాయని అన్నారు.

పశుగణన పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న డీడీ రామ్మోహనరావు, సిబ్బంది

పశుగణనను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో పశుగణన సర్వేను వేగవంతం చేయాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పాలేటి రామ్మోహనరావు సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని గాజుల కొల్లివలస, ఆర్‌ఆర్‌కాలనీ, చిట్టివలస, గుంటువానిపేట తదితర గ్రామాల్లో పశు సంవర్ధకశాఖ సిబ్బంది నిర్వహిస్తున్న 21వ అఖిలభారత పశుగణన సర్వేను ఆయన పరిశీలించారు. గ్రామాల్లోని పలు గృహాల వద్ద సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే తీరును ప్రజలు, పాడి రైతులను అడిగి తెలుసుకున్నారు. సర్వే నిర్వహించిన ప్రతి గృహానికి స్టిక్కర్‌ను అంటించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 28 వరకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గ దర్శకాల ప్రకారం ఈ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కోళ్లు, పక్షులతో సహా 16 రకాల పెంపుడు జంతువుల సమాచారాన్ని ఈ సర్వేలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు కళ్యాణి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అపరాధ రుసుము వసూలు చేస్తున్న హెల్త్ ఆఫీసర్ సుధీర్ కుమార్

పాలిథిన్ వాడకంపై చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో పాలిథిన్ కవర్ల వాడకంపై ఉన్న నిషేదం అమల్లో భాగంగా బుధవారం పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో నగరపాలక సంస్థ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్ కుమార్ ఆధ్వర్యాన జరిపిన దాడుల్లో తోపుడు బళ్లపై వ్యాపారాలు సాగిస్తున్న చిరు వ్యాపారుల నుంచి కవర్లు సీజ్ చేసి వారి నుంచి రూ.14 వేలు అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ దాడులు ఉధృతం చేసి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నట్టు మున్సిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ సుదీర్ కుమార్ తెలిపారు.

మాట్లాడుతున్న మోహన్ రంగా రౌలో

రైల్వే సమస్యలపై వినతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో సమస్యలను పరిష్కరించాలని జెఆర్‌యుసిపి సభ్యులు మోహన్ రంగా రౌలో కోరారు. ఈ మేరకు కుర్దా రోడ్ డిఆర్‌ఎం హర్భజన్ సింగ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో కొత్తగా నిర్మిస్తున్న టిక్కెట్ కౌంటర్ భవనం పూర్తి చేయాలన్నారు. రత్తకన్న గేట్ దగ్గర బ్రిడ్జి నిర్మించాలన్నారు. సోంపేట రైల్వేస్టేషన్‌లో షిఫ్ట్ రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభించాలన్నారు. జాడుపూడి రైల్వేస్టేషన్‌లో బ్రహ్మపూర్, వైజాగ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని విన్నవించారు. కార్యక్రమలో రైల్వే సీనియర్ డిసిఎం ఎఇఎన్ రైల్వే ఇంజినీర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తిరుపతిరావు తదితరులు

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- లావేరు

రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలు పరిష్కరించబడుతుందని డిటిఎం తిరుపతిరావు అన్నారు. బుధవారం కేశవరాయపురం, జి.జి.వలస గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యలపై వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరించడం జరుగు తుందని తెలిపారు. మండలంలోని 42 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బల్లాడ శ్రీధర్ రెడ్డి, ఆర్‌ఐ ఆర్.అప్పలరాజు, విఆర్ఓ సత్యవతి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ పోటీలకు నలుగురు ఎంపిక

ఇచ్ఛాపురం: విజయనగరంలో ఈ నెల 9 నుంచి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న అండర్-12 ఇంటర్ జిల్లా క్రికెట్ పోటీలకు జిల్లా టీం తరుపున ఇచ్ఛాపురం నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ (ఐసిసి)కు చెందిన సాలిన సాయి, డిషోజ్ యాదవ్, సమీత్ గౌడో, ఎ.వి.దక్ష్, ఓంప్రకాష్ ఎంపికయ్యారు. వీరు ఎంపికపై క్రికెట్ అకడమిక్ కోచ్ గోపి ఆనందం వ్యక్తం చేశారు. ఎంపికైన క్రీడాకారులకు మాజీ క్రీడాకారులు, తోటి క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

గతుకుల రోడ్లకు అతుకులు ఎప్పుడో..?

- రోడ్లపై గోతులతో ప్రజలకు తప్పని అవస్థలు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

ప్రజాశక్తి- బూర్జ

లచ్చయ్యపేట కూడలి వద్ద రోడ్డుపై పడిపోయిన బియ్యం బస్తా

మండలంలోని పలు గ్రామాల వద్ద ఉన్న గోతులు ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. అటు శ్రీకాకుళం నుంచి ఇటు పాలకొండ వెళ్లే ప్రధాన రహదారిపైన పలు గ్రామాల వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో అనునిత్యం వాహనదారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ముఖ్యంగా లచ్చయ్యపేట, మర్రిపాడు, పాలవలస గ్రామాల కూడళ్ల వద్ద పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సంక్రాంతిలోపు రహదారులను సుందరంగా తీర్చిదిద్దు తామని, గోతులు లేని రహదారులను ఏర్పాటు చేస్తామని ప్రకటనలు గుప్పించినా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు చోద్యం చూస్తు న్నారని స్థానికులు వాపోతున్నారు. ఎంతో ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించిన ప్రజా ప్రతినిధులు ఈ రహదారుల వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు ఈ రహదారులపైన అనునిత్యం ప్రమాదాలకు గురై ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నప్పటికీ సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని స్థాని కులు ఆరోపిస్తున్నారు. బుధవారం పాలకొండ నుంచి బియ్యాన్ని కొనుక్కొని లచ్చయ్యపేట గ్రామానికి ఆటోలో వస్తున్న మహిళ గోతుల కారణంగా చేతి

పాలవలస కూడలి సమీపంలో రోడ్డుపై గోతులు

నుంచి బియ్యం బస్తా చేజారింది. బియ్యం బస్తా మొత్తం చిరిగిపోయి బియ్యం రోడ్డుపై పడి పోయాయి. దీంతో నిరుపేదరాలైన మహిళ ఆవే దనకు గురైంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పం దించి గతుకుల రోడ్లకు అతుకులు వేయాలని, ప్రమా దాలు నివారించాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీరాములు నాయుడు వర్ధంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో తొలితరం రాజకీయాల్లో నిజాయతీ, నిబద్ధత గల నాయకుడు, మాజీమంత్రి గొర్లె శ్రీరాములు నాయుడు అని పలువురు కొనియాడారు. బుధవారం ఆయన వర్ధంతి సందర్భంగా నగరంలోని ఏడురోడ్ల జంక్షన్ వద్ద, కిమ్స్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా తూర్పుకాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సురంగి మోహనరావు, నాయకులు ఎస్.జోగినాయుడు, కిలారు నారాయణరావు పాల్గొని మాట్లాడారు. జిల్లా అభివృద్ధిలో ఆయన చేసిన కృషి చిరస్మరణీమన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా, జెడ్‌పి చైర్మన్‌గా వివిధ పదవులు అలంకరించిన ఆయన ఆ పదవులకు వన్నె తెచ్చారన్నారు. కార్యక్రమంలో టిడిపి

రణస్థలం : పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తున్న నాయకులు

నాయకులు అందవరపు ప్రసాద్, కనుగుల దుర్గా శ్రీనివాస్, కురిటి రామకోటేశ్వరరావు, వాకర్స్ అధ్యక్షులు బి.వి.రవిశంకర్, తూర్పుకాపు సంఘం ప్రతినిధులు లంక గాంధీ, కెళ్ల చిన్నకృష్ణ, డోల బాలకృష్ణ, అంపోలు లక్ష్మణరావు, మిర్తివాడ ప్రభాకర్, అంకడాల తవిటన్న, కొమ్ము రమణ మూర్తి, కృష్ణచంద్, జగన్నాథ నాయుడు పాల్గొన్నారు.

రణస్థలం: జిల్లా రాజకీయ దురంధరుడు, మాజీ మంత్రి గొర్లె శ్రీరాములు నాయుడని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో దివంగత నేత, మాజీ మంత్రి గొర్లె శ్రీరాములు నాయుడు 20వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండల ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయి కుమార్, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్ద రామునాయుడు, నాయకులు కురిటి రామకోటి, సర్పంచ్ గొర్లె జగదీష్ నాయుడు, బిసి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పిల్ల ఆనంద్ పాత్రో, మహంతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పలాస : భోగి మంట వేసిన అధ్యాపకులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని మురపాక కెజిబివి పాఠశాలలో బుధవారం ప్రిన్సిపాల్ బల్ల సుధారాణి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగుల రంగవల్లులు, గొబ్బెమ్మలు, హరిదాసు వేషాలు, బోగిమంటలు, కోలాటాలతో నృత్యాలు చేశారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ముగ్గులు ఫోటోలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అధ్యక్షతన బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముందుగా భోగి మంటలు వేసి సంక్రాంతి చక్రపొంగలి తయారు చేసి విద్యార్థులకు అందజేశారు. కళాశాల క్రీడా ప్రాంగణంలో రంగురంగుల గాలి పటాలను విద్యార్థులు ఎగరవేశారు. విద్యార్థినులకు రంగవల్లికల పోటీను నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు ఎనలేని ఉత్సాహం ప్రదర్శిస్తూ రంగురంగుల అందమైన ముగ్గులను వేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందుకున్నారు. విద్యార్థినులు వేసిన రంగవల్లికలు ఆహుతలను అలరించాయి. కళాశాలలోని మహిళా సాధికారిక, ఐక్యుఎసి విభాగం పర్యవేక్షణలో నృత్య పోటీలు

లావేరు : భోగి మంట వేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకుల సాంప్రదాయ వస్త్రధారణ ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ వెంకటరమణ, మహిళా సాధికారిక విభాగ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- పోలాకి

ఇటీవల మబగాం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన గ్రిగ్స్ క్రీడలు పోటీల్లో ఈదులవలస ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఎపి మోడల్ స్కూల్‌లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ అభినందనలు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి రన్నింగ్‌లో పి.తేజశ్విని, ఎం.తనుశ్రీ, జె.శరణ్య, ఎం.దినేష్‌కుమార్, కె.భరత్‌కుమార్, పి.ఝాన్సీలు ప్రతిభ కనబరిచారని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం.నీలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రణస్థలం: నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ ఆటల పోటీలు స్థానిక జె.ఆర్.పురం హైస్కూల్ ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో కొండ ములగాం ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు సాధించారు. షార్ట్‌పుట్‌లో దున్న సుచరిత ప్రథమ స్థానం

పోలాకి : అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రవీణ

గెల్చుకోగా డిస్కస్‌త్రోలో కోమలి ప్రథమ, సుచరిత ద్వితీయ స్థానాలు సాధించారు. అదే విధంగా 100 మీటర్లు పరుగు పందెంలో జస్వంత్ తృతీయ, 400 మీటర్ల పరుగు పందెంలో రమణ తృతీయ బహుమతులు సాధించారు. వీరు జిల్లాస్పోర్ట్స్ అధ్యక్షులు ఎం.వి.రమణ చేతులమీదుగా పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరికి గైడ్‌గా పిఇటి రాము వ్యవహరించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ పి. కృష్ణ అభినందనలు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

రికార్డులను పరిశీలిస్తున్న పిఒ నాగరాణి

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదో వార్డులో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ పిఒ నాగరాణి బుధవారం పరిశీలించారు. ఈ మేరకు అంగన్వాడీ కేంద్రంలోని రికార్డులను పరివీలించారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. అలాగే బాలింతలు, గర్భిణులు చిన్నారుల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.అంగ న్వాడీ సిబ్బంది రవణమ్మ, స్వాతి, సహాయకులు పాల్గొన్నారు.

పాల్గొన్న విద్యార్థులు

టాలెంట్ టెస్టుకు స్పందన

సోంపేట : బారువ పూర్వ విద్యార్థి సంఘం 64వ వార్షికోత్సవ వేడుకలు పురస్కరించుకొని బుధవారం బారువలో నిర్వహించిన డివిజనల్ స్థాయి గ్రూప్ టాలెంట్ టెస్టుకు స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజనల్ పరిధిలో 198 టీంలు పోటీలో పాల్గొన్నాయని అన్నారు. ప్రథమ స్థానాన్ని వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట పాఠశాల విద్యార్థులు, ద్వితీయ స్థానాన్ని పలాస మండలం మామిడిపల్లి పాఠశాల విద్యార్థులు, తృతీయ స్థానాన్ని మందస మండలం కొత్తూరు పాఠశాల విద్యార్థులు, నాలుగో స్థానాన్ని మందస మండలం సిహెచ్.కేసుపురం పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. వీరికి ప్రోత్సాహ కాలను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న జశ్వంత్‌పాత్రో

రాష్ట్రస్థాయికి పలాస సైన్స్ ప్రాజెక్టు

పలాస: రాష్ట్రస్థాయికి పలాస హైస్కూల్ ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్ ప్రాజెక్టు ఎంపికైంది. సదరన్ ఇండియా సైన్స్ ఫెస్ట్ 2024-25 సరేట్, సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యాన విజయవాడలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి జస్వంత్ పాత్రో, గైడ్ టీచర్ జినగ షణ్ముఖరావు ఆధ్వర్యాన రీజనరేటివ్ బ్రేకింగ్ సిస్టం ప్రాజెక్టు ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో రాష్ట్రస్థాయిలో గెలుపొందింది. విజేతలకు సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు బహుమతి ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో గెలుపొందిన విద్యార్థి, గైడ్ టీచర్‌కు పాఠశాల హెచ్‌ఎం డి.దాశరధి, ఉపాధ్యాయులు అభినందించారు.

దుప్పట్లు పంపిణీ

సోంపేట : స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వి.గోపీకిరణ్, కార్యదర్శి టి.క్రాంతి, కోశాధికారి శ్రీరాములు సోంపేట, కంచిలి, జాడపూడి రైల్వేస్టేషన్లల పరిధిలో నిరుపేదలకు బుధవారం దుప్పట్లు అందజేశారు. చలికాలం నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎస్.ప్రశాంత్, ప్రసాద్, కె.సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

అడవి బిడ్డల ఆక్రందన

అధ్వాన రోడ్లతో అవస్థలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జిల్లాలో అతిపెద్ద గిరిజన మండలమైన మెళియాపుట్టిలో అభివృద్ధి ఛాయలు కానరాకుండా పోయాయి. అధిక శాతం గిరిజన గ్రామాలే ఉండడం వల్ల గ్రామాలకు మౌలిక సౌకర్యాలు లేక గిరిజనులు ఆక్రందనకు గురవుతున్నారు. గిరిజన పల్లెల వైపు తొంగిచూసే నాథుడే కరువయ్యారు. ఎన్నికల్లో తప్ప మిగతా సమయాల్లో గిరిజన గ్రామాల వైపు పాలకులు, అధికారులు సందర్శించిన దాఖలాలు లేవు. అక్కడి బాగోగులు వారికి పట్టవు. మండలంలో 37 పంచాయతీలు 150 గ్రామాలు ఉన్నాయి. దాదాపు 56,000 పైబడిన జనాభా ఉంది. ఇందులో వంద గ్రామాలపైబడే గిరిజన గ్రామాలే. ఏళ్ల గడుస్తున్నా పూర్తిస్థాయి రహదారి సౌకర్యానికి దూరంగా ఉన్నారు. వేసవికాలం మాట ఎలా ఉన్నా మిగతా సమయాల్లో రహదారులు నరకయాతనగా తయారవుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో గిరిపుత్రులు నానా అవస్థలు పడుతున్నారు. కొండపై గ్రామాల గిరిజనులకు డోలీలు మోత తప్పడం లేదు. ఆల్ ఆంధ్ర రోడ్ నుంచి దారిపేటకు వెళ్లే రహదారి రాళ్లు తేలి దయనీయంగా మారింది. నేల బొంతు నుంచి మూలనెలబొంతుకు రహదారి అభివృద్ధి కొరబడింది. గొడ్డ నుంచి ఆంపురానికి ఏడు కిలోమీటర్ల రహదారి గత ఐదేళ్లుగా అభివృద్ధి లేక ఇప్పటికీ మట్టి రోడ్డు గిరి పుత్రులకు శరణ్యమైంది. ఈ ప్రాంతంలోని పది గ్రామాల ప్రజల రాకపోకలకు అసౌకర్యం ఏర్పడింది. నేలబొంతు నుంచి వీరన్నపేట మీదుగా గొట్టిపల్లి వరకు ఉండే ఐదు కిలోమీటర్ల బిటి రోడ్డు రాళ్లు తేలాయి. రహదారి పిచ్చి మొక్కలతో మూసుకుపోవడంతో కాలిబాటగా తయారైంది. ఈ రోడ్డులో టెక్కలి నుంచి వీరన్నపేట గాటి వరకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఉండేది. రహదారి అభివృద్ధి లేకపోవడంతో బస్సు సౌకర్యం దూరం కావడంతో గిరిజనులు నానా అవస్థలకు గురవుతున్నారు. అలాగే డబ్బగుడ్డి, హడ్డివాడ కొండపై భాగంలో ఉండే అడ్డువాడ, చందనగిరి గేటుపేట గ్రామాల రహదారి అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. భరణికోట కాలనీ నుంచి బాలేరుకు వెళ్లే బిటి రోడ్డు రాళ్లు తేలాయి.

రాళ్లు తేలిన గొడ్డ-ఆంపురం రోడ్డు

మెళియాపుట్టి-పలాస రోడ్డు నుంచి పదనాపురానికి వెళ్లే రహదారి రాళ్లు తేలి నడవడానికి కూడా అసౌకర్యంగా ఉంది. గిరిజన గ్రామాల అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యం చూపడంతో ఆమడ దూరంలో ఉంది. అలాగే కొండ ప్రాంతంలో నివాసం ఉంటూ వారి జీవనోపాధికి వనరులు లేక ఇంకా పేదరికంతోనే మగ్గుతున్నారు. గతేడాది వర్షాలు సక్రమంగా లేకపోవడంతో పోడు పంటలు పండలేదు. దీంతో గిరిజనుల జీవనోపాధి లోపించింది. తాగునీటి సమస్య, వైద్య సేవలు సమస్య వెంటాడుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలకూ దూరం అవుతున్నారు.

అధ్వానంగా ఉన్న వీరన్నపేట-గొట్టిపల్లి రోడ్డు

గిరిజన గ్రామాలపై చిన్నచూపు



గిరిజన గ్రామాలపై పాలకులు చిన్న చూపు చూస్తున్నారు. మౌలిక సౌకర్యాలు కొరబడ్డాయి. గిరిజన గ్రామా లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సరైన రోడ్లు లేక వాహన దారులు, పాద చారులు అవస్థలు పడుతున్నారు. నియోజక వర్గ నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది.

- జమ్మయ్య, ఆంపురం సర్పంచ్

రోడ్లను అభివృద్ధి చేయాలి



గిరిజన ప్రాంతాల రోడ్లను అభివృద్ధి చేయాలి. అలాగే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి. గిరిజన గ్రామాలకు ఐటిడిఎ నుంచి నిధులు సమకూర్చాలి. రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించినా ప్రయోజనం లేకుండాపోయింది.

- సవర ఆదినాయుడు, వైస్ ఎంపిపి

సచివాలయ ఉద్యోగిపై దాడి

ఆమదాలవలస: పట్టణంలోని 10, 11వ వార్డులకు సంబంధించి మెట్టక్కివలస-1 సచివాలయంలో వార్డు అడ్మిన్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న సూరపు ఆనందరావుపై మెట్టక్కివలసలోని పుట్టవీధికి చెందిన కొప్పల ఈశ్వరరావు అలియాస్ రమేష్ దాడికి పాల్పడినట్లు సచివాల అడ్మిన్ సెక్రటరీ ఆనందరావు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ-2 ఎ.సింహాచలం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సచివాలయ క్లస్టర్ పరిధిలోని హౌస్ హోల్డ్ మ్యాపింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఆనందరావు కొప్పల ఈశ్వరరావును ఫోన్‌లో సంప్రదించి మీ రేషన్ కార్డులో మీరు మీ అమ్మ, భార్య ఉన్నారని హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో మాత్రం మీరు యాడ్ కాలేదని తెలిపారు. మీరు చేరడానికి ఒక ఒటిపి నెంబర్ వస్తుందని ఆ నెంబర్‌ను తెలియజేస్తే హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో మిమ్మల్ని కూడా యాడ్ చేస్తామని ఈశ్వరరావుకు తెలపగా తన తల్లి, భార్యను యాడ్ చేయాలని, తనను వేరుగా యాడ్ చేయాలని తెలుపగా అందుకు సచివాలయ అడ్మిన్ ఆనందరావు తిరస్కరించి అలా చేస్తే తన ఉద్యోగం పోతుందని చెప్పగా ఫోన్‌లో ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన ఈశ్వరరావు సచివాలయానికి తన అనుచరులతో కలిసి వెళ్లి ఆనందరావుపై దాడి చేయడంతో మెడ కింద భాగంలో గాయం కావడంతో పోలీసులు ఆనందరావును మండల పరిధిలోని 30 పడకల జొన్నవలస ఆస్పత్రికి చికిత్సకోసం తీసుకు వెళ్లారు. ఆనందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈశ్వర రావు, మరి కొంతమందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ-2 సింహాచలం తెలిపారు.

బ్యాటింగ్ చేస్తున్న లక్ష్మీనారాయణ

క్రికెట్ టోర్నీ ప్రారంభం

మెళియాపుట్టి: మండలంలోని వెంకటాపురంలో సంక్రాంతి సందర్భంగా మాజీ ఎంపిపి బైరిసింగి లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన ఆదివాసీ అల్లూరి సీతారామరాజు టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభిఁచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ ఐదు రోజుల పాటు నిర్వహిస్తామని, 30 టీమ్‌లు పాల్గొంటాయని తెలిపారు. గిరిజన యువత క్రీడలపై మరింత ఆసక్తి పెంపొందించేందుకు దోహదమ వుతుందని అన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో విజేతలకు ట్రోఫీ, బహుమతులను అందజేస్తామని తెలిపారు.

విద్యుద్దీకరణ పనులు పరిశీలన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ భాస్కరరావు

మండలంలోని పల్లివూరు పంచాయతీ పలు గ్రామాల్లో విద్యుద్దీకరణ పనులు చురుగ్గా సాగు తున్నాయి. చిన్నపల్లివూరులో విద్యుత్ స్తంభాలకు విద్యుత్ దీపాలను అమర్చే పనులను సర్పంచ్ మామిడి భాస్కరరావు బుధవారం పరిశీలించారు. సంక్రాంతికి ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. అన్ని గ్రా మాల్లో విద్యుత్ దీపాలు అమరుస్తున్నామని తెలి పారు. అలాగే పారిశుద్య పనులు చేపట్టామని అన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

సోంపేట: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ లవరాజు సూచించారు. స్థానిక కనకదుర్గ ఆలయంలో ఆటో యూనియన్ నాయకులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్లంతా రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలన్నీ తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. డ్రైవర్ల పక్కన ప్రయాణికులను కూర్చోపెట్టరాదన్నారు. లౌడ్ స్పీకర్లు ఉండరాదన్నారు.

వార్డును పరిశీలిస్తున్న వైద్యాధికారి లక్ష్మణరావు

హెచ్ఎంపివి ఐసోలేషన్ వార్డు ఏర్పాటు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి జిల్లా ఆస్పత్రిలో 20 పడకలతో కూడిన హెచ్ఎంపివి ఐసోలేషన్ వార్డును బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఇటీవల దేశంలో హెచ్ ఎంపివి కేసులు పెరుగుతున్న కారణంగా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆస్పత్రిలో సూపరి ంటెండెంట్ బి.సూర్యారావు ఆధ్వర్యాన ఈ ఐసోలేషన్ వార్డు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

435 మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి- జి.సిగడాం

జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు, కోడిపందాలు, పేకాట నిర్వహణ, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నేపథ్యంలో జి.సిగాడం పోలీసులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన పోలీసు స్టేషన్‌కు వస్తుండగా నడిమివలస గ్రామ కూడలి వద్దకు వచ్చేసరికి ఎదురుగా టివిఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంపై ఒక వ్యక్తి మూడు మూటలు వేసుకుని వస్తుండగా అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ పొగిరి శంకర్, సిబ్బంది ద్విచక్రవాహనాన్ని ఆపి మూడు సంచులను క్షుణ్ణంగా తనిఖీ చేయగా సుమారు రూ.56.926 విలువ గల 435 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి జ్యుడిషల్ రిమాండ్‌కు తరలించినట్టు జె.ఆర్.పురం సిఐ ఎం.అవతారం తెలిపారు.

పట్టుకున్న మద్యం సీసాలతో పోలీసులు